కరెంట్.. నో ఆన్‌లైన్!



విద్యుత్ బిల్లుల చెల్లింపులో మార్పులు.. అయోమయంలో వినియోగదారులు

- టీజీఎస్‌పీడీసీఎల్ యాప్ లేదా సంస్థ వెబ్ సైట్ ద్వారానే సేవలు
- నేటి నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు
- పేమెంట్స్ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లింపునకు అనుమతి నిరాకరణ
- జులై 1 నుంచి అమలులోకి వచ్చిన ఆర్బీఐ కొత్త నిబంధన

నల్లకుంట: ఒక్కప్పుడు విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు గంటల తగరబడి క్యూ లైన్‌లలో వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ క్రమంలో చెల్లింపులో జాప్యం జరిగితే జరిమానాతో కలిపి బిల్లు చెల్లించాల్సి వచ్చేది. కానీ ఆన్‌లైన్ పేమెంట్స్ యాప్‌లు వచ్చిన తర్వాత ఆయా యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించుకునే వెసులుబాటును ఆయా సంస్థలు కల్పించాయి. మొదట్లో పేమెంట్స్ యాప్‌లో చాలా తక్కువ మంది బిల్లులు చెల్లించే వారు. ప్రజల్లో అవగాహన పెరగడంతో అనతికాలంలోనే ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులు పుంజుకున్నాయి. ఇకపై గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడం కుదరదు. విద్యుత్ సంస్థ టీజీఎస్‌డీసీఎల్ మొబైల్ యాప్‌లో లేదా సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించాలి. ఆర్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధన వినియోగదారులను అయోమయానికి గురి చేస్తోంది.

అంబర్‌పేటలో 75శాతం ఆన్‌లైన్ చెల్లింపులే..

అంబర్‌పేటలో 12 లక్షలకు పైగా విద్యుత్ సర్వీస్‌లు ఉన్నాయి. మరికొన్ని హెచ్‌టీ సర్వీసులు, పరిశ్రమల సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు విద్యుత్ సంస్థకు ఆదాయం సమకూరుతోంది. నియోజకవర్గంలో దాదాపు 75 శాతం వినియోగదారులు ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లిస్తున్నారు. 25 శాతం మంది మీసేవా లేదా విద్యుత్ సిబ్బందికి ఇచ్చి బిల్లులు కడుతున్నారు.

ఆర్బీఐ ఈ నిబంధన ఎందుకు తీసుకొచ్చిందంటే...

ఈ ఏడాది జూలై ఒకటి నుంచి ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేసింది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే ద్వారా ప్రజలు కరెంట్ బిల్లులు చెల్లించిన తర్వాత ఆ డబ్బు విద్యుత్ సంస్థకు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నేరుగా సంస్థకు డబ్బులు చేరేలా ఆర్బీఐ చర్యలు తీసుకుంటోంది. విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో చెల్లిస్తే నేరుగా ఆ డబ్బు సంస్థకు చేరేలా రూపకల్పన చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఆగస్టు 1 నుంచి క్యూఆర్ కోడ్

విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఇక నుంచి క్యూఆర్ కోడ్ అమలు కానుంది. ఆగస్టు 1 (నేటి) నుంచి ఈ విధానం అమలు జరిపేందుకు టీజీఎస్పీడీసీఎల్ 'క్యూఆర్ కోడ్'విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీంతో విద్యుత్ పంపిణీ సంస్థ టీజీఎస్‌పీడీసీఎల్ ప్రత్యేకంగా యాప్ రూపొందించింది. వినియోగదారులకు జారీ చేసే విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్ ఉండనుంది. ఈ క్యూర్ కోడ్ స్కాన్ చేసి తేలిగ్గా బిల్లు చెల్లించవచ్చు. వివిధ కారణాలతో ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధన కారణంగా చాలా మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా విద్యుత్ శాఖ తీసుకొచ్చిన సౌకర్యంపై ఇప్పటి వరకు ప్రజలకు అవగాహన లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల్లో సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించే వాళ్లం. మా బస్తీలో చాలా మందికి జీరో బిల్లులే వస్తున్నాయి. కాని 200 యూనిట్లకు పైగా విద్యుత్ వాడుకునే వినియోగదారులకు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో ఎలా చెల్లించాలనే దానిపై చైతన్య పరచాలి.
– పి.ఈశ్వర్, రత్నానగర్ నల్లకుంట

కొత్త నిబంధన ప్రజలకు తెలియదు



ఆర్బీఐ కొత్త నిబంధన ప్రజలకు తెలియదు. అధికారులు కూడా తెలియజేయలేదు. ఇప్పటికీ చాలా మంది యాప్‌ల ద్వారా ప్రతి నెలా మాదిరిగా విద్యుత్ బిల్లులను చెల్లిస్తే సరిపోతుందనుకుంటున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోతే గడువు మీరిందంటూ జరిమానా రూపంలో అదనంగా చెల్లించి నష్టపోవాల్సి ఉంటుంది. ఆగస్టు 1 నుంచి క్యూఆర్ కోడ్ అమలులోకి వస్తుందని తెలిసింది. వీటిపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించాలి.
– గోవర్ధన్‌రెడ్డి, బాగ్ అంబర్‌పేట

వ్యవసాయశాఖలో బదిలీలు చేపట్టాలి



వ్యవసాయ శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ వ్యవసాయశాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు బదిలీలు చేపట్టాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. చిన్నారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సంఘం అధ్యక్షుడు డా. వైద్యనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. బదిలీలు చేపట్టకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాల అమలులో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సక్రమంగా పనిచేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. అందుకు స్పందించిన మంత్రి సాధ్యమైనంత త్వరలో బదిలీలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వైద్యనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి, నాయకులు శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఇతర సంఘం నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలి

నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ నీల వెంకటేష్

కాచిగూడ: అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తూ 11 ఏళ్లుగా అక్కడే తిష్టవేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ బండ విద్యావతిపై చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్.చోంగ్తుకు ఫిర్యాదు చేశారు. రెండు సార్లు సస్పెండ్ అయినా ఒకే సీట్లో దశాబ్దానికి పైగా కొనసాగుతూ కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్న విద్యావతిపై విచారణ జరిపించాలని కోరారు. వెంటనే నర్సింగ్ కౌన్సిల్‌కు కొత్త రిజిస్ట్రార్‌ను నియమించాలన్నారు. త్వరలో సీఎం, వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ, సాయికృష్ణ, మధు, మహేష్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తండి



ఎమ్మెల్యే హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ముషీరాబాద్: విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీష్‌రావును పీడీఎస్‌యూ నేతలు కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విడుదల, బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయింపు, నీట్ బాధితులకు న్యాయం, అన్ని యూనివర్సిటీలకు రెగ్యూలర్ వీసీలను నియామకం, యూనివర్సిటీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మధు, పి.నాగరాజు, నాయకులు బి.ప్రణయ్, మంద నవీన్, తీగల శ్యామ్, యశ్వంత్ తదితరులు ఉన్నారు.

తెలుగు సాహిత్య సంపద దాశరథి

చిక్కడపల్లి: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కవితాగ్నులు కురిపించిన దాశరథి త్యాగం తెలంగాణ ప్రజలకు నిత్య స్మరణీయుడని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం అన్నారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో దాశరథి కృష్ణమాచార్య జయంతి సభ జరిగింది. ప్రధాన వక్తగా డాక్టర్ శంకరం పాల్గొని దాశరథి కవితా సంపుటులు అగ్నిధార, అగ్నివీణ గురించి వివరించారు. తెలుగు సాహిత్య సంపద దాశరథి అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై చిక్కడపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య, సాహితీ వేత్త ఆచార్య జయరాములు, కవి రఘుశ్రీలు పాల్గొని దాశరథి చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన హామీని అమలు చేయాలి

ముషీరాబాద్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ముషీరాబాద్ డిపోలో టీఐ సీస నర్సింహగౌడ్, ఏడీసీ ఎం.శ్రీనివాస్, కండక్టర్ బి.ఇస్తారీ ఉద్యోగ విరమణ కార్యక్రమం డిపో అధికారి కళ్యాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు హనుమంతు ముదిరాజ్, బోడుప్పల్ మున్సిపాలిటీ కార్పొరేటర్లు విజయ్‌గౌడ్, సింగిరెడ్డి పద్మారెడ్డి, అజయ్‌యాదవ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో బుధవారం చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులను బలవంతంగా పోలీసులు అరెస్టు చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. బడ్జెట్‌ను సవరించి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. విద్యాశాఖ మంత్రిని నియమించాలని విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం, ముద్రధారణ

కాచిగూడ: రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో బుధవారం సుదర్శన హోమం, ముద్రధారణ కార్యక్రమం కనుల పండువగా జరిగింది. ఉడిపి జగద్గురు శ్రీమధ్వాచార్య మూల మహా సంస్థానం పలిమారు మఠానికి చెందిన విద్యాధీశ తీర్థ శ్రీపాదుల స్వామివారి చాతుర్మాస దీక్షలో భాగంగా ఈ వేడులకను నిర్వహించారు. శ్రీమద్వాచార్యులు పూజించిన శ్రీరామ – సీత– లక్ష్మణుల విగ్రహాలకు పీఠపూజ చేశారు. కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహ సందేశం చేశారు. సత్కార్యాలు, సామాజిక సేవలు భగవంతుడి ఆశీస్సులను అందిస్తాయని అన్నారు. అనుగ్రహ సందేశానంతరం ఆలయంలో తొట్ల పూజను నిర్వహించారు. భక్తులకు మంత్రాక్షింతల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌రావు, కె.నర్సింహ చార్, నర్సింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌ను వెంటనే అరెస్టు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక నాయకులు

అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక డిమాండ్

కవాడిగూడ: దివ్యాంగులను అవమానపరిచిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే విధుల నుంచి తొలగించి అరెస్టు చేయాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్మితా సబర్వాల్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం కొల్లి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.... వారం రోజులుగా వికలాంగులపై ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ చేసిన అనుచిత వాఖ్యలపై దివ్యాంగులు చేస్తున్న నిరసన కార్యక్రమాలను ఏమీ పట్టనట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి స్మితా సబర్వాల్‌కు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారిగా ఉన్న ఆమె ఈ విధంగా మాట్లాడడం ఐఏఎస్ క్యాడర్‌కే మాయని మచ్చ అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల హక్కుల వేదిక నాయకులు జంగల్ శ్రీనివాస్, శ్రీనివాస్, డేవిడ్, నర్సింహారెడ్డి, మాధవి, వెంకటేష్, లక్ష్మి, శంకర్, బాలకృష్ణ, గోవింద్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదులను సైద్ధాంతికంగా ఓడించాలి

మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మతోన్మాదులను ఓట్ల పరంగా ఓడించడం తాత్కలికమేనని అయితే వారిని సైద్ధాంతికంగా ఓడించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. మతోన్మాద ప్రమాదంపై చేస్తున్న ప్రచారం, తటస్థులు, మతోన్మాద అనుకూలకుల వద్దకు వెళ్లే భాషను ఉపయోగించాలని సలహా ఇచ్చారు. బుధవారం వామపక్షాల పార్టీల ఆధ్వర్యంలో 'మతోన్మాదం – సెక్యులరిజం'అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అతిథిగా హాజరైన ప్రొ. కే.నాగేశ్వర్ మాట్లాడుతూ...సెక్యులరిజాన్ని నిర్దిష్ట రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దాని కోసం 'నూతన ప్రచార శైలి'అవసరమని సూచించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ... సెక్యూలరిజం పరిరక్షణ ఏ ఒక్క పార్టీ, వామపక్ష పార్టీలతో సాధ్యం కాదన్నారు. ఇందు కోసం విశాలమైన మతోన్మాద వ్యతిరేక వేదిక అవసరమని సూచించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లాల్లోనూ సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చర్చనీయంశంగా చేయాలన్నారు. సిపిఐ జాతీయ నాయకులు చాడా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్, న్యూ డెమాక్రసీ నాయకులు కె.గోవర్ధన్, సీనియర్ జర్నలిస్టు కె.శ్రీనివాస్, ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఎంసీపీఐయూ గాదగోని రవి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

నల్లకుంట: సత్యానగర్‌బస్తీలో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత బుధవారం జలమండలి అధికారులకు సూచించారు. నారాయణగూడ డివిజన్ జీఎం కృష్ణతో కలిసి బస్తీలో కొనసాగుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. అదే విధంగా బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి

అంబర్‌పేట: సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని డీఎంసీ మారుతీ దివాకర్ అన్నారు. సర్కిల్ కార్యాలయంలో ఎంటామాలజీ, జలమండలి, పారిశుద్ధ్య విభాగాల అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో వృథాథాగా తాగునీరు రోడ్లపై ప్రవహించకుండా చూడాలన్నారు. మురుగు రోడ్లపై నిల్వకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు దోమల బెడద లేకుండా చూడాలన్నారు.

కార్పొరేటర్ హౌస్ అరెస్ట్

కాచిగూడ: అసెంబ్లీ ముట్టడికి మహిళా మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ ముఖ్య మహిళా నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు చేశారు. బుధవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్‌ను ఇంటి నుంచి భయటకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

అంబర్‌పేట: మాజీ మంత్రి హరీష్‌రావు సహకారంతో సీఎంఆర్ఎఫ్ పేదలకు అందేలా కృషి చేస్తానని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య అన్నారు. బుధవారం ఆమె కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.16.50 లక్షల విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత దూసరి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలి

తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం, రైతాంగాన్ని కాపాడటానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం అత్యంత విషాదకరమన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ... వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని కనీస మద్దతు ధర చట్టం చేయాలని, రుణమాఫీ చేయాలని, ఎరువుల సబ్సిడీకి కోత విధించడాన్ని ఆపివేయాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పరిశోధన రంగాన్ని కార్పొరేట్ విత్తన కంపెనీలకు అప్పగించొద్దన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కశ్య పద్మ, పి.ప్రభాకర్, భిక్షపతి, ఆర్.వెంకటరాములు, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై రాజకీయ పార్టీలది దాటవేత ధోరణే..



బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: కుల గణన విషయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలది దాటవేత ధోరణి అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శించారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకంగా.. అధికారంలోకి రాగానే మరో రకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. గతంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు కుల గణన డిమాండ్లపై మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. పార్లమెంటులో అప్పటి బీజేపీ నాయకులు రాజ్‌నాథ్‌సింగ్ సైతం ఈ విషయాన్ని ప్రస్తావించారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ అంశంపై 76 సంవత్సరాలుగా అడుగు ముందుకేయని కాంగ్రెస్ పార్టీ ఈ మధ్య 'కుల గణన తమ ప్రధాన ఏజెండా'గా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో రాజ్‌కుమార్, జెల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, హరికృష్ణ, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

చిక్కడపల్లి: గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంతో పాటు గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. హైదరాబాద్ టీఎన్‌జీవో యూనిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శి శాగంటి అయోధ్య , బొల్లం మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం నగర కేంద్ర గ్రంథాలయంలో చైర్మన్ డాక్టర్ రియాజ్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా టీఎన్‌జీవో సెంట్రల్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.ముజీబ్ హుస్సేన్‌లను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంచాలకులు ఏఈవీఎస్ రాజు, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి విక్రమ్, నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, గ్రంథాలయ యూనిట్ సంఘం నాయకులు వెంకటేశ్ యాదవ్, కృష్ణారెడ్డి, శుక్లాదేవి, మదన్మోహన్, రామ్మోహన్, సుకేశ్, శంకర్, హరిబాబు, మేశ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్'లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కవాడిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని...రెండో పీఆర్‌సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరి పార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యఅతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో సుమారు 40వేల మంది ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిన, 90వేల మంది ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తామని వాగ్దానం చేసి దాని అమలులో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు గత 20 సంవత్సరాలుకు పైగా వివిధ ప్రభుత్వ శాఖలలో అతితక్కువ వేతనాలతో తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్నారని పేర్కొన్నారు.
- తెలంగాణ యూనివర్సిటీలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్నవారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ నియామకాలలో ఔట్‌సోర్సింగ్, డేలి వేజ్, ఎన్ఎంఆర్, కంటింజెంట్ వర్కర్లకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. వారి సర్వీసు ఆధారంగా దశలవారీగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. మహిళలకు ఆరు నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.10లక్షల ప్రమాద బీమాతో పాటు జీవిత బీమా సౌకర్యం కల్పించి విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ మీసేవా ఉద్యోగులకు వేతనాలు పెంచి ప్రభుత్వ మీసేవా సెంటర్లను బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లపై ప్రభుత్వం దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు జె. వెంకటేష్, ఉపాధ్యక్షురాలు పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శి జె. కుమారస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు ఎడ్ల రమేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అన్యాయం చేసేలా మాట్లాడటం సరికాదు

ఎమ్మెల్యేలు కేటీఆర్, వివేకానంద్ చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్

కవాడిగూడ: అసెంబ్లీ సమావేశాలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ 'ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూప్‌లో చేర్చాలి'అని చేసిన వ్యాఖ్యలను తెలంగాణ గంగపుత్ర సంఘం, తెలంగాణ బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నేతలు తీవ్రంగా ఖండించారు. బండ మైసమ్మనగర్‌లో రాష్ట్ర గంగపుత్ర సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30లక్షల మంది గంగపుత్రుల మనోభావాలను దెబ్బతీసే విధంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే వారు అసెంబ్లీలో ముదిరాజ్‌లకు మద్దతుగా చేసిన వాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను గంగపుత్రులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగపుత్రులకు అన్యాయం చేసే విధంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, బీసీ–ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డా. బాగయ్య, గంగపుత్ర యువజన సంఘం అధ్యక్షుడు అంబటి మల్లయ్య, సుధాకర్ గంగపుత్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడప శంకర్, దీటి సత్యనారాయణ మాట్లాడారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గంగపుత్ర సంఘం, బీసీ–ఏ కులల పరిరక్షణ సమితి నేతలు